క్లుప్తంగా

నీట మునిగిన పత్తి



పత్తి పంటలో నిలిచిన వర్షపు నీరు

పలిమెల: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలు, గోదావరిలో పెరిగిన వరద తీవ్రతతో మండలంలోని పంకెన, లెంకలగడ్డ, సర్వాయిపేట గ్రామాల్లో పత్తి పంటకు నష్టం చోటుచేసుకుంది. సుమారు ఈ గ్రామాల్లో 20 పైగా ఎకరాల్లో నీరు నిలిచి పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు.

బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న నాయకులు

చిట్యాల: మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన పర్లపెల్లి భద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు జన్నె యుగేందర్ పరామర్శించి 50 కిలోల బియ్యం అందజేశారు. గ్రామస్తులు కట్కూరి నర్సయ్య, ఆరెపల్లి అంకుష్, బోట్ల రాజయ్య, శీలపాక రాజేందర్, సంఘం నాయకులు కిరణ్, శంకర్, సునీల్, హరీష్, రాజు, అశోక్ పాల్గొన్నారు.

టాక్సీ యాప్ నమోదు తప్పనిసరి

పలిమెల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా ఇసుక రవాణా మరింత దగ్గర చేయాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఇసుక టాక్సీ యాప్ ద్వారా ప్రజలకు మరింత చేరువలోకి తీసుకువచ్చారని తహసీల్దార్ అనిల్ తెలిపారు. ఇందులో భాగంగా మండలంలో ట్రాక్టర్ డ్రైవర్లు అందరూ ఇసుక టాక్సీ యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవసరమైన పత్రాలను సమర్పించాలని, సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించడం ద్వారా మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరైన ఇసుక రవాణాకు సులభతరమవుతుందని వివరించారు. మరిన్ని వివరాలకు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మండల కమిటీ ఎన్నిక



మొండయ్యకు సన్మానం చేస్తున్న నాయకులు

టేకుమట్ల: తెలంగాణ కుమ్మర సంఘం మండల కమిటీని మండల కేంద్రంలో మండల ఇన్‌చార్జ్ ఆకారపు శంకరయ్య సమక్షంలో బుధవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నాంపెల్లి వీరేశం, అధ్యక్షుడిగా సముంద్రాల మొండయ్య, ఉపాధ్యక్షులుగా సముద్రాల రాజయ్య, పోతుగంటి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా ఇజ్జిగిరి సంపత్, కోశాధికారిగా ఆరుట్ల రమేశ్, కార్యదర్శిగా ఆరుట్ల ఐలయ్య, సహాయ కార్యదర్శిగా ఆరుట్ల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా కానుగుల రాజు, సలహాదారులుగా కాసూరి శ్రీనివాస్‌తో పాటు పలువురి కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు మొండయ్యను సభ్యులు సన్మానించారు.

మహదేవపూర్ మండల..

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కుమ్మరి శాలివాహన సంఘం మండల కమిటీని మండల అబ్జర్వర్లు తాటికంటి రవి, ఇస్తారి, జిల్లా నాయకులు సముద్రాల తిరుపతి ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పోతుగంటి సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా శనిగరం శంకర్, కోశాధికారిగా సముద్రాల రాజశేఖర్‌లను ఎన్నుకున్నారు. ఆ సంఘం నాయకులు గణపురం రాజు, పోతుగంటి సత్యం, దరిపెల్లి బక్కమల్లయ్య, పెద్దపెల్లి మల్లయ్య, పెద్దపెల్లి రాజన్న, పెద్దపల్లి రాజబాబు పాల్గొన్నారు.

నియామకం



రాజేందర్‌ను సన్మానిస్తున్న కులస్తులు

రేగొండ: కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో కుమ్మరి సంఘం మండల కమిటీని బుధవారం నియమించారు. అధ్యక్షుడిగా చిగురుమామిడి రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా కిషన్, ఉపాధ్యక్షులుగా తిరుపతి, శ్రీనివాస్ ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు రాజేందర్‌ను కులస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. కుమ్మరి కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహ కరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

పల్లెకు రాని 'పల్లె వెలుగు'

- పలు గ్రామాలకు లేని ఆర్టీసీ బస్సు సౌకర్యం
- ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు, విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



టేకుమట్ల: గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం బాగు పడినట్లు అన్న మహాత్మాగాంధీ ఆశయాలకు ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయి. రవాణా సౌకర్యం లేక ఇప్పటికీ వెనకబడి ఉన్న గ్రామాలపై పట్టింపు లేకపోవడంతో అత్యవసర సమయంలో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 24 గ్రామ పంచాయతీలు, 4 హామ్లెట్ గ్రామాలు ఉండగా అంకుషాపూర్, సోమనపల్లి, సుబ్బక్కపల్లి, పెద్దంపల్లి, కలికోట, బోయినిపల్లి, జోడుపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సొంత వాహనాలు, ప్రైవేట్ వాహనాలపై ఆధారపడి వెళ్లాల్సి వస్తుంది. మండల కేంద్రానికి నిత్యం అధికార కార్యాలయాలకు, వ్యాపార, వ్యక్తిగత అవసరాల నిమిత్తం గ్రామాల నుంచి రావాలంటే చుక్కలు చూడాల్సిందే. ఇక మహిళలు, వృద్ధుల పరిస్థితి మరీ దారుణం. అంకుషాపూర్, సోమనపల్లి, సుబ్బక్కపల్లి గ్రామాల విద్యార్థులు ప్రతీ రోజు కాలి నడకన, సైకిళ్లపై మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు రావాలి. ఇక వర్షాకాలంలో వారి ఇబ్బందులు ఎనలేనివి. ఇదే అదునుగా భావిస్తున్న ప్రైవేటు వాహన దారులు అందినకాడికి దండుకుంటూ అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. అలాగే మండలంలోని దుబ్యాల, మందలోరిపల్లి, వెల్లంపల్లి, గుమ్మడవెల్లి, కుందనపల్లి, బండపల్లి, ఎంపేడు గ్రామాలకు కరీంనగర్ జిల్లా, జమ్మికుంట పట్టణం నుంచి బస్సులు వెళ్తుంటాయి. కానీ ఆయా గ్రామాల నుంచి మండల కేంద్రానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో మండల కేంద్రానికి రావాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సు సౌకర్యం లేక దశాబ్దాలు గడుస్తున్నా ఆయా గ్రామాల రవాణా సౌకర్యంపై ఏ ప్రభుత్వాలు, నాయకులు పట్టించుకోలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అధికారులకు తెలిపిన బస్సు సౌకర్యం కల్పించడం లేదని తెలుపుతున్నారు.

మంత్రికి తెలిపిన రాని బస్సులు

మండలంలోని అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఇటీవల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందించారు. మంత్రితో ఎమ్మెల్యే చేసిన మంతనాలు ఫలిస్తే మండలంలోని గ్రామాలకు రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. కానీ ఇప్పటి వరకు అమలు కాకపోవడంతో నిరాశతో ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



"సుబ్బక్కపల్లి, సోమనపల్లి, అంకుషాపూర్ గ్రామాల ప్రజలు నిత్యం మండల కేంద్రానికి వస్తూ పోతుంటారు. గతంలో కొన్ని రోజులు మాత్రమే బస్సు సౌకర్యం ఉంది. ప్రస్తుతం రోడ్డు సౌకర్యం కూడా ఉండడంతో బస్సు సౌకర్యం కల్పించాలి. దాని వల్ల పరకాలకు వెళ్లే ప్రయాణికులు సులభంగా ప్రయానించే అవకాశం ఉంటుంది. దూర భారం తగ్గడంతో పాటు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

\- ఉద్దమారి మహేష్‌యాదవ్, మాజీ సర్పంచ్ సోమనపల్లి

ప్రైవేట్ వాహనాలే దిక్కు..



ఎంపేడు నుంచి మండల కేంద్రానికి రావాలంటే ప్రైవేటు వాహనాలే దిక్కు. ఎంపేడు నుంచి జమ్మికుంటకు మాత్రమే బస్సు ఉంది. నిత్యం మండల కేంద్రానికి గ్రామస్తులు వస్తుంటారు కావున ఎంపేడు నుంచి టేకుమట్లకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి.

\- కొలిపాక రాజయ్య, మాజీ సర్పంచ్ ఎంపేడు

బీజేపీని బలోపేతం చేయాలి

- పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి



మాట్లాడుతున్న సంజీవరెడ్డి

కాటారం: బీజేపీని గ్రామ గ్రామాన బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి సూచించారు. మండల కేంద్రంలో బుధవారం కాటారం సబ్ డివిజన్‌లో రాష్ట్ర నాయకులు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, చల్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసహనంతో ఉన్నారని దేశంలో మాదిరిగా రాష్ట్రంలో బీజేపీ పాలనను ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు సాధించడం ఖాయమని తెలిపారు.

నూతన కార్యవర్గం నియామకం

బీజేపీ పార్టీ కాటారం మండల కార్యవర్గాన్ని పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ప్రకటించారు. అధ్యక్షుడిగా పాగె రంజిత్, ఉపాధ్యక్షులుగా తోడె వీరారెడ్డి, గంట అంకయ్య, చీర్ల బాపురెడ్డి, చీర్ల అశోక్‌రెడ్డి, పర్తిరెడ్డి హన్మయ్య, సదానందం, ప్రధాన కార్యదర్శులుగా ఆత్మకూరి స్వామియాదవ్, గోగుల రాజేశ్, మంత్రి సునీల్, బొంతల రవీందర్, కార్యదర్శులుగా మధు, బండి రమేశ్, బొడ్డు శివ, మల్లారెడ్డి, సుధాకర్, గాలి సారయ్య, కోశాధికారిగా తోడె శ్రీనివాస్‌రెడ్డి, కిసాన్ మోర్చా గండు తిరుపతి, ఎస్సీ మోర్చా వేముల లింగయ్యను నియమించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పాగె రంజిత్, పూర్ణచందర్, మనోజ్, శ్రీకాంత్, దుర్గం తిరుపతి, బండం మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న నాయకులు

చిట్యాల: మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన నిరుపేదలకు చేయుత ఫౌండేషన్ అధ్యక్షుడు మ్యాదరి సునీల్ ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ.. రిటైడ్ నిట్ ప్రొఫెసర్ కునిశెట్టి సుబ్బారావు–సుశీలదేవి దంపతుల సహకారంతో గ్రామంలో 25 మంది నిరుపేదలకు 10కిలోల బియ్యంతో పాటు నూనే, గోధుమపిండి ప్యాకెట్లు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మీ, మాజీ ఎంపీటీసీ జంబుల తిరుపతి, డైరెక్టర్ గుర్రం మహేందర్, జీపీ కార్యదర్శి నవీన్, అకినపల్లి అనిల్ కుమార్ , సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

- ఎంపీడీఓ శ్రీనివాస్



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మల్హర్: పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మల్లారం గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్లను ఎంపీడీఓ బుధవారం పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్లకు పలు సూచనలు చేశారు. అలాగే మల్లారం జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లోని మౌలిక వసతులపై ఆరా తీశారు. సబ్ సెంటర్‌ను తనిఖీ చేసి, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు. కారోబార్ శ్రీకాంత్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- వైద్యాధికారిణి నాగరాణి



విద్యార్థులకు సూచనలిస్తున్న నాగరాణి

మొగుళ్లపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారిణి నాగరాణి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంజేపీ పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ.. వర్షాలు అధికంగా పడడం వల్ల సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వచ్చే అవకాశం ఉందన్నారు. కాబట్టి విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరికైనా జ్వరాలు వచ్చినట్లయితే వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్

మల్హర్: ప్రమాదవశాత్తు ఓ ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని పెద్ద తాడిచర్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివారల ప్రకారం.. పెద్దతాడిచర్ల గ్రామానికి చెందిన శ్రీనాథ్ ఇంట్లోనే కిరాణా షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తాడు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో కిరణషాపులో ప్రమాదవశాత్తు మంటలు వచ్చాయి. గమనించిన కుటుంబ సభ్యులు మంటలు ఆర్పే ప్రయతన్నం చేశారు. కాగా, షాపులోని కిరాణా సామగ్రి, బైక్, ఎలక్ట్రానిక్ పరికరాలు దగ్ధమయ్యాయి. సుమారు రూ.8లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు శ్రీనాథ్ తెలిపారు. సమాచారం అందుకున్న డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ అక్కడికి చేరుకోని బుధవారం ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. రూ.5.28లక్షల నష్టం జరిగినట్లు అంచనా వేశారు. ప్రమాదం ఎలా జరిగిందనే కారణం ఇంకా తెలియలేదు. బాధితుడు శ్రీనాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొయ్యూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



పోచమ్మ గుడికి వెళ్తున్న గ్రామస్తులు

చిట్యాల: మండలంలోని జూకల్ గ్రామంలో శ్రావణమాసం సందర్భంగా పోచమ్మ బోనాల పండుగను బుధవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు బోనాలతో పోచమ్మ గుడికి బయలుదేరి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు దొంతి రాంరెడ్డి, పలువురు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వరద ఉధృతి పరిశీలన

ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెం వద్ద మండల ప్రత్యేకాధికారి, జిల్లా సివిల్ సప్లయిస్ డీఎం రాంపతి, తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కుమార్ నది ఉధృతిని పరిశీలించారు. బుధవారం సాయంత్రం రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద వరద పెరుగుదలను పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. అనంతరం ఓడవాడ, పద్మశాలి వాడ సమీపంలోని ప్రజలను వరద ఎక్కువైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వాహనాలను సైతం సిద్ధం చేసి పెడుతామని తెలిపారు. వరద వస్తే తామే సమాచారం ఇస్తామని అధికారులకు ప్రజలు హామీ ఇవ్వడంతో అధికారులు వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రఘు, ఎల్లయ్య, దేవేందర్, అరుణతో పాటు పోలీసులు పాల్గొన్నారు.

గిరిజన భవన్‌లో పునరావాసం

మండలంలోని క్రాస్‌రోడ్డులో గల గిరిజన భవన్‌కు తరలించిన ముంపు బాధితులకు బుధవారం ఉదయం టిఫిన్, భోజన సదుపాయాన్ని గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది కల్పించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏ ర్పాట్లు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి రమాదేవి తెలిపారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

దేశానికి దివంగత మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ అందించిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకులు అన్నారు. జిల్లా వ్యాప్తంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

\- సాక్షి నెట్‌వర్క్



టేకుమట్ల: రాజీవ్‌గాంధీ జయంతి వేడుకల్లో నాయకులు



మొగుళ్లపల్లిలో..



చిట్యాలలో..



కాటారంలో..

'బీఆర్ఎస్ నాయకులకు మతిభ్రమించింది'

కాళేశ్వరం: బీఆర్ఎస్ నాయకులకు మతిభ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు లేతకరి రాజబాబు బుధవారం ప్రకటనలో ఆరోపించారు. 2020లో మేడిగడ్డ గేట్లు తెరవడంతో లెంకలగడ్డ గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు నీట మునిగితే బీఆర్ఎస్ పార్టీ ఒక్క రూపాయి సాయం చేయలేదని అన్నారు. ఆ రోజు అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌పార్టీ నాయకులు పట్టించుకోలేదని తెలిపారు. ఆనాడు ఎమ్మెల్యేగా దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కుటుంబాలను పరామర్శించి అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. చిల్లర మాటలు మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు కొండగొర్ల సంతోష్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

రేగొండ: వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, జనరల్ మహిళా, చిన్నకారు, సన్నకారు రైతులకు రాయితీపై రాష్ట్ర ప్రభుత్వం పలు రకాల పనిముట్లు అందజేస్తుందని ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ వాసుదేవారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నిబంధనల మేరకు అర్హత ఉన్న రైతులకే ఈ రాయితీ పరికరాలు అందజేస్తున్నామని, సెప్టెంబర్ 6 వరకు దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్, కుల ధ్రువీకరణ పత్రం ఏఈఓలకు అందజేయాలన్నారు. ఈ పథకం ద్వారా మండలానికి బ్యాటరీ స్ప్రేయర్స్–75, పవర్ స్ప్రేయర్స్– 25, రోటవేటర్స్–5, కల్టివేటర్స్ –6, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్–1, బ్రష్ కట్టర్ –1, పవర్ టిల్లర్–1, స్ట్రాబేలర్–1 కేటాయించినట్లు తెలిపారు.

మహాధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీఆర్టీయూ నాయకులు

రేగొండ: పీఆర్టీయూ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న తలపెట్టిన మహాధర్నా వాల్‌పోస్టర్‌ను బుధవారం కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గిరిధర కృష్ణ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1న పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి సీపీఎస్ అమలులోకి తీసుకువచ్చిన రోజును చీకటి దినంగా పేర్కొంటున్నామన్నారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాను ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు కుమారస్వామి, శిరీష, జిల్లా బాధ్యులు చక్రధర్, ఉపాధ్యాయులు రాజేందర్, శ్రీధర్, కోటిలింగం, శ్రీనివాస్, కల్పన, ప్రతాప్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పలిమెల: మండలంలోని పలిమెల గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రమేశ్ బుధవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2150 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పోలీసులకు పట్టుబడిన వారిలో మందుల రమేశ్, తలారి రమేశ్, జనగామ లక్ష్మయ్య, కుమ్మరి రాజబాబు, పడాల రమేశ్, బజాల బాణయ్య, ఒడిశె శివరాం ఉండగా మరో ముగ్గురు తోలెమ్ సుధాకర్, కుమ్మరి సడవళి, కుమ్మరి రమేశ్ పారిపోయినట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

నేడు ట్రాక్టర్ యజమానులతో సమావేశం

టేకుమట్ల: మండలంలోని అన్ని గ్రామాల ట్రాక్టర్ యజయానులతో నేడు(గురువారం) ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ విజయలక్ష్మీ బుధదవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇసుకను తరలించే ట్రాక్టర్ యజమానులు తప్పనిసరిగా మధ్యాహ్నం 12గంటలకు తహసీల్దార్ కార్యాలయానికి రావాలని పిలుపునిచ్చారు.

'యూరియా తిప్పలు మంత్రికి పట్టవా?'

కాటారం: రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు సొంత మండలం కాటారంలో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ ఆయనకు, అధికారులకు ఏ మాత్రం పట్టింపులేదని బీఆర్ఎస్ నాయకుడు రామిళ్ల రాజబాబు బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. యూరియా కోసం రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పీఏసీఎస్ గోదాం ఎదుట క్యూలో నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మంత్రి మండలంలోనే రైతుల పరిస్థితి ఇలా ఉంటే ఇతర ప్రాంతాల్లో అన్నదాతల కష్టాలు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చని విమర్శించారు.

నిషేధిత గడ్డిమందు పట్టివేత



నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మేడిగడ్డ వద్ద ఎస్సై పవన్‌కుమార్ బుధవారం పెట్రోలింగ్ చేస్తుండగా ఓ వ్యక్తి వద్ద నిషేధిత గడ్డి మందు (గ్లైసిల్) లభించింది. అనుమానాస్పదంగా కనిపించిన అతని వద్ద ఉన్న ఒక సంచిని తనిఖీ చేయగా 15 బాటిల్ల గడ్డి నిషేధిత గడ్డి మందును లభించిదని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ గడ్డిమందును మహారాష్ట్రలో కొనుగోలు మహాముత్తారం మండలానికి తీసుకువెళ్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు.